# బళ్ళారి భూతం

"ఏమండీ, మీ సెమినార్ ఎలా జరిగింది? హంపీబాగాచూశారా?" అని అన్నం వడ్డిస్తూ అడిగింది హేమ.

"చాలా బాగా జరిగింది. మన దేశం వాళ్ళే కాకుండా విదేశాల నుండి కూడా చాలా మంది పేరున్న ఆర్కియాలజిస్టులు వచ్చారు. నేను కూడా చాలా యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశాను. నా పెర్‌ఫార్మెన్స్ అందరికీనచ్చింది. హంపీ శిథిలాలు, శిల్పాలు అన్నీ చూశాను. మనం కూడా ఓ సారి వెళ్దాం" అన్నాడు సురేష్

"అక్కడి నుంచి బళ్ళారి వెళ్ళి మీ స్నేహితుడిని చూసి వస్తామన్నారు. బళ్ళారి వెళ్ళారా?"

"ఆఁ వెళ్ళాను. సర్‌ప్రైజ్ విజిట్ చేసేసరికి మధుకర్ ఎంత సంతోషించాడో!అతను సరే. వాళ్ళావిడ, అమ్మ కూడా ఎంత మర్యాద, అభిమానం చూపించారో!

"వాళ్ళ పిల్లలు!"

"మనలాగా వాళ్ళకీ పిల్లలు లేరు"

"అయితే మిత్రులిద్దరూ ఒకే బాటలో నడుస్తున్నారన్నమాట" అంది హేమ నవ్వుతూ.

"దానికేంలేగాని మధూ అమ్మగారిని చూస్తే చాలా బాధ వేసింది!"

"అదేం పాపం!"

"ఆవిడకి బాగా చిన్నతనంలోనే భర్త చనిపోయాడు. తండ్రి పోయేసరికి మధు తల్లి కడుపులో నాలుగు నెలల శిశువు. పాపం ఆ ఇల్లాలు భర్తతో గట్టిగా ఎనిమిది నెలలు కూడా కాపరం చేయ లేదు."

"ఎంత దారుణం?"

"అంతకు మించిన దారుణం మరోటి ఉంది. పట్టుమని పద్దెనిమిదేళ్ళు లేని ఆ కాత్యాయనికి నిర్దాక్షిణ్యంగా తల గొరిగించి గుండు చేయించి తెల్ల చీర కట్టబెట్టారు."

"ఎంత అన్యాయం? ఇంతకీ ఆవిడ వయసు ఎంత ఉంటుంది?"

"నలభై అయిదు లోపే"

"చిన్నావిడే.. ఇంకా ఈ రోజుల్లో కూడా ఇంతటి దారుణానికి పాల్పడుతున్నవాళ్ళున్నారా?"

"ఉన్నారు. కాలం ఎంత మారుతున్నా ఉష్ట్రపక్షిలాగా ఇసుకలో తలదూర్చుకుని, ఆచారం పేరిట అకృత్యాలు చేసే ప్రబుద్ధులు ఇప్పటికీ ఉన్నారు. అయినవాళ్ళు వదిలేస్తే అష్టకష్టాలుపడి మధుకర్ పెద్దై పైకి తీసుకువచ్చి ఇంతవాడిని చేసింది:

"మధుకర్ వాళ్ళుకన్నడవాళ్ళా? పేరు చూస్తే అలా ఉంది!"

"అవును. కన్నడవాళ్ళే. ఇప్పటికీ బళ్ళారి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఈ దురాచారాలు సాగుతూనే ఉన్నాయి. కర్నాటకలో ఇటువంటివి చాలానే చూస్తాం."

"అది సరే. ఆవిడ ఇప్పుడు మధుకర్ దగ్గరే ఉంటుంది కదా! మరి ఆవిడ అలా ఉండడానికి ఇతనెలా ఒప్పుకున్నాడు?"

"వాడు ఎంతగానో చెప్పి చూశాడు. ఆవిడ ఇంతకాలం జుట్టు తీయించుకుని సగం వయసు అయిపోయాక మళ్ళీ జుట్టు పెంచుకుంటావా? ఈ జీవితం ఇలాగే పోనీ అంటూ ఒప్పుకోలేదు. ఇంక చేసేదిలేక ఊరుకున్నాడు."

"పాపం... ఏ పూర్వజన్మ పాపమో ఆవిడది"

"నిజమే. ఆమెని చూస్తే అంతటి ఉత్తమ ఇల్లాలు మరొకరు ఉండరని అనిపిస్తుంది. ఆమె నన్ను ఎంత అభిమానంగా చూసిందో!మా అమ్మ కూడా నన్నంత ప్రేమగా చూసిందా అనిపించింది. ఏనాటి అనుబంధమో. ఉన్నది ఒక్క రోజే అయినా నాలుగు రకాల పిండివంటలు చేసి దగ్గర కూర్చుని మరీ తినిపించింది. ఇంకా రెండు మూడు రోజులుండమని బలవంతపెట్టింది. ఆమె అభిమానం చూస్తే జాలివేసింది."

"కొడుకు స్నేహితుడికి మర్యాద చేయడంలో అబ్బురం ఏమీ లేదు కాని మీరు చెప్పింది వింటే, ఆమె మరీ ఎక్కువగా అభిమానం చూపించిందేమో ననిపించింది. ఏదైనా మరీ ఎక్కువైతే ఎబ్బెట్టుగా ఉంటుంది. అది సరే. ఆవిడ పెట్టింది ఏదైనా అరగలేదా ఏమిటి. అన్నం తినలేక పోతున్నారు?"

"అదేం లేదు. మాటల్లోపడి మెల్లగా తింటున్నానంతే."

"సరదాగా కబుర్లతో భోజనంచేసి నడుంవాల్చాడు సురేష్. మర్నాడు సురేష్‌కి ఉండుండి పొట్టలో నెప్పిరాసాగింది. ముల్లుతో గుచ్చుకున్నట్లు బాధ కలిగింది.

"మీరు ఊళ్ళు తిరిగి వచ్చారుగా. ఏ నీళ్ళుతాగారో ఏమో! ఏదో వాటర్ ఇన్‌ఫెక్షన్ అయిఉంటుంది. మా నాన్నగారు టూర్‌కి వెళ్ళినప్పుడల్లా ఆముదం పుచ్చుకునేవారు. రాత్రి పడుకునే ముందు పర్గొలాక్స్ వేసుకు పడుకోండి. కడుపులో ఏకుట్ర ఉన్నా ఝాడించి కొట్టివేస్తుంది" అంటూ వైద్య సలహా యిచ్చింది.

"ఆమె చెప్పినట్లే చేశాడు సురేష్. డొక్కలు అంటుకు పోయేటట్లుగా పొట్ట ఖాళీ అయిందే కాని పొట్ట నొప్పి మళ్ళీ వచ్చింది. వెంటనే డాక్టర్‌కి చూపించారు. ఆయన ఇచ్చిన మందులు వేస్కుంటే తగ్గినట్లే తగ్గి మళ్ళీ రాసాగింది. ఇంక పాలీక్లినిక్‌కి వెళ్ళి స్పెషలిస్టుని కన్సల్ట్ చేశాడు.ఆయన ఎక్స్‌రే, బేరియం టెస్ట్, బ్లడ్ టెస్ట్, యూరిన్ టెస్ట్, స్టూల్స్ టెస్ట్ వగైరా టెస్టులన్నీ, అవసరమైనవీ, అవసరం లేనివీ కూడా చేయించి చాంతాడంత మందుల లిస్టు రాసిచ్చాడు. తినే అన్నం కంటే ఈ మందుల పరిమాణమే ఎక్కువ అయ్యింది. అయినా ఫలితం కన్పించ లేదు. రోజులు గుడస్తున్న కొద్దీ నెప్పి ఎక్కువ అవుతోందే కాని తగ్గడం అంటూలేదు. ఇంక ఇంగ్లీషు మందులతో లాభం లేదనుకుని హోమియో, ఆయుర్వేదం, యునాని కూడా చేయించాడు. అయినా ఫలితం శూన్యం. అల్లుడికి వంట్లో బాగాలేదనీ చూడడానికి వచ్చింది కామాక్షమ్మగారు. ఆవిడవస్తూనే "ఏమిటే అమ్మా.. బంగారంలా వుండే అల్లుడుగారు ఇలా అయిపోయారు?" అంది గద్గద కంఠంతో.

"ఏమిటోనమ్మా.. ఆరు వారాల క్రితం హంపీ, బళ్ళారి వెళ్ళి వచ్చారు. అప్పటి నుంచి ఈ పీడ పట్టుకుంది. ఎవరి దిష్టి తగిలిందో ఏమో?" అంది హేమ. ఆమె మనసులో మధుకర్ తల్లి కాత్యాయని తన భర్తకి దిష్టికొట్టిందన్న అనుమానం పీడిస్తోంది.

"బళ్ళారి వెళ్ళాడా! అక్కడ ఎవరింట్లో భోజనం చేయలేదు కదా!" - ఆందోళనగా అడిగింది కామాక్షమ్మగారు.

"వాళ్ళ స్నేహితుడు మదుకర్ ఇంట్లో ఒక రోజు ఉండి వచ్చారు"

"వాళ్లింట్లో విధవ స్త్రీలు ఎవరూ లేరు కదా?"

"వాళ్ళమ్మగారు విధవరాలే. బాల వితంతువట".

"ఆవిడే అన్నం వండిపెట్టి ఉంటుంది."

"ఇంకెవరు వండుతారు? పైగా ఎంతో అభిమానంతో నాలుగు రకాల పిండివంటలు చేసి దగ్గరుండి తినిపించిందట."

"అయ్యో.. అయ్యో.. ఎంత పనయింది! ఇప్పుడేమిటి చేయడం!" అంటూ శోకన్నాలు మొదలు పెట్టింది కామాక్షమ్మ.

"ఏమైందమ్మా?నాకేం అర్థంకావడం లేదు" అంది హేమ కంగారుగా.

బేజారుగా చూశాడు సురేష్.

"ఇంకా ఏం కావాలే తల్లీ. బళ్ళారిలో, ఇంకా కొన్ని కర్నాటక ప్రాంతాలలోనూ ఒక ఆచారం ఉందమ్మా. అక్కడ బ్రాహ్మణ వితంతువులకి తాము వండిన అన్నంలో విషం కలిపి యువకులకి తినిపిస్తే వచ్చే జన్మలో నిండు నూరేళ్ళు పుణ్యస్త్రీగా జీవిస్తుందని ఆ నమ్మకం . అందువల్ల చాలమంది విధవలు ఈ విధంగా విషప్రయోగం చేస్తారట. ఆ విషంనెమ్మది నెమ్మదిగా పని చేసి ప్రాణం తీస్తుంది. దీనికి విరుగుడు ఉండదట. ఉన్నా చాలా కష్టంట. అందువల్ల తెలసిన వాళ్లెవరూ బళ్ళారిలో బ్రాహ్మణ వితంతువులు ఉన్న ఇళ్ళల్లో భోజనం చేయరు. టిఫిన్ కూడా ముట్టరు. మీ నాన్నగారు కూడా బళ్ళారిలో ఉద్యోగం చేశారు. కాని ఎప్పుడూ ఎవరి ఇంట్లోనూ భోజనం చేయలేదు అని వివరంగా చెప్పింది.

"అమ్మా - నువ్వు చెప్పింది నిజమేననిపిస్తోంది. లేకపోతే ముక్కూ ముఖం తెలియని ఆయనకి రక రకాల పిండి వంటలు చేసి దగ్గరుండి ఎందుకు తినిపిస్తుందీ! అదంతా అభిమానం, బోళాతనం అనుకున్నామే కాని ఆవిడ కడుపులో ఇంతటి కుట్ర ఉందని అనుకోలేదు. ఎంత దారుణం! ఎంత మోసం! ఎరక్కపోయి వెళ్ళి ప్రాణం మీదకి తెచ్చుకున్నారు. ఇప్పుడేవిటిచేయడం?" అంటూ ఏడవసాగింది హేమ.

"ఛ.. ఊరుకోండి. అర్థంలేని ఆలోచనలు మీరూను. ఎవరేనా వింటే నవ్విపోతారు. ఏవో మూఢనమ్మకాలు ఉంటుంటాయి. అవన్నీ నిజం అనుకుంటే ఎలా?" అని చికాకు పడ్డాడు సురేష్.

"అలా అనకండి అల్లుడుగారూ. వాళ్ళింట్లో భోజనం చేశాకనే కదా మీకు ఈ నలత పట్టుకుంది. మీరే ఆలోచించండి. ఆవిడ అంతటి అభిమానం ఊరికే చూపించిందంటారా? అంతతేలిగ్గా కొట్టేయకండి" అంది కామాక్షమ్మగారు.

సురేష్ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయాడు.

"ఇప్పుడు ఏమిటి చేయడం? దీనికి విరుగుడు లేదా? పోనీ వెళ్ళి ఆవిడనే నలుగురిలో నిలదీసి అడిగితే?"అంది హేమ.

"ఛ... నోర్ముయ్. అర్థం లేకుండా మాట్లాడకు. ఆవిడకి తెలిస్తే ఎంతో బాధపడ్తుంది? ఇంక మళ్ళీ మొహాలు చూసుకోలేనంతగా మా స్నేహం చెడిపోతుంది" అని గట్టిగా కోప్పడ్డాడు సురేష్.

ఇంక అక్కడ ఉండక తల్లీ కూతుళ్ళు లోపలికి వెళ్ళారు. వాళ్ళు వెళ్ళాక సురేష్ ఆలోచనలో పడ్డాడు. ముందు తాను కొట్టేసినా, ఆలోచిస్తే అత్తగారు చెప్పింది నిజమేనేమోననిపిస్తుంది. తాను

బళ్ళారిలో భోజనం చేశాకనే అనారోగ్యం కలగడమేమిటి? పోనీ నీళ్ళు, తిండి పడలేదు అనుకుంటే ఎన్ని వైద్యాలు చేయించినా తగ్గక పోవడమేమిటి? ఎన్ని టెస్టులు చేయించినా అసలు వ్యాధి ఏమిటో అంతు పట్టక పోవడమేమిటి?

ఆలోచించిన కొద్దీ కాత్యాయని తనకు విషంపెట్టే ఉండాలన్న అనుమానం అంతకంతకీ బలపడసాగింది సురేష్‌కి. అంకురంగా మనసులో ప్రవేశించిన అనుమానం మహావృక్షంలా పెరిగి ఊడలు వేయసాగింది. అనుమానం మనసుని పీడిస్తుంటే, ఆరోగ్యం దేహాన్ని కృంగదీస్తూ అంతకంతకీ క్షీణించిపోసాగాడు సురేష్.

దిష్టి తీయించారు. భూత వైద్యాలు చేయించారు. స్వాములు, అమ్మలు, బాబాలు దగ్గరికి తీసుకు వెళ్ళి తీర్థాలు, ఆశీస్సులు ఇప్పించారు. తాయెత్తులు కట్టించారు. ఎన్ని చేసినా వ్యాధి తగ్గకపోగా నానాటికీ ముదిరి మరింతగా కృంగదీయసాగింది. చూస్తుండగా ఎముకుల పోగులా అయ్యాడు సురేష్.

హేమకి, కామాక్షమ్మగారికి కంటిమీదకునుకు రావడం లేదు. తిన్న తిండి వంట పట్టడం లేదు. దిగులుతో చిక్కిపోయారు. నిత్యం కాత్యాయనిని తిట్టుకోసాగారు.

సురేష్ బాబాయి డాక్టరు వాసు అమెరికాలో స్థిరపడ్డ డాక్టర్. హేమ సంగతి వివరంగా చెప్తూ ఆయనకి ఉత్తరం రాసింది. పది రోజుల్లోనే ఆయన దగ్గర్నుంచి సమాధానం వచ్చింది. బొంబాయిలో డాక్టర్ మెహతా అనే సైకియాట్రిస్ట్, హిప్నాథెరపిస్టు ఉన్నారని ఆయన దగ్గరకి వెళ్తే తప్పక నయం అవుతుందని చెప్తూ ఆయన పేర ఉత్తరం కూడా పంపించారు. డాక్టర్ మెహతా సురేష్‌ని క్షుణ్ణంగా పరీక్షించాడు. వాళ్ళందరూ చెప్పినవన్నీ శ్రద్ధగా విన్నాడు.

"మిస్టర్ సురేష్ మీకు ఈ రోజు బ్లడ్ సాంపుల్ తీసుకుంటాను. తరవాత ఒక మందు యిస్తాను. రేపు మళ్ళీ బ్లడ్ సాంపుల్ తీస్తాను. ఈ రెండింటినీ కంపేర్ చేస్తే నిజంగా విషప్రయోగం జరిగితే తెలుస్తుంది. అప్పుడే దానిని విరిచేయవచ్చు. అది కాక పాతే వేరే పద్ధతిలో వ్యాధేమిటో తెలుసుకుందాం" అన్నాడు. ఆయన మాట్లాడుతోంటేనే సగం వ్యాధి తగ్గినట్టనిపించింది సురేష్‌కి.

మర్నాడు డాక్టర్ మెహతా "మిస్టర్ సురేష్ మీ అనుమానం నిజమే. మీకు విష ప్రయోగం జరిగింది. ఇది స్లోపాయిజన్ రక్తం అంతా వ్యాపించింది. మీకు రోజూ కొన్ని మందులు ఇస్తాను. వాటి వల్ల విషం నెమ్మది నెమ్మదిగా కడుపులోకి దిగుతుంది. వారం అయ్యేసరికి అది గట్టిపడి ఉండగ మారుతుంది. అప్పుడు మీకు వాంతి చేయిస్తాను. ఈ ఉండ వాంతిలో బయటకు వచ్చేస్తుంది. అంతే త్వర త్వరగా మీ ఆరోగ్యం బాగుపడుతుంది"అంటూ భుజం తట్టాడు.

ఏడో రోజున ఏదో మందిచ్చి సురేష్ చేత వాంతిచేయించాడు. వాంతి వస్తూంటే నీరసంతో కళ్ళు మూసుకున్నాడు సురేష్.

పింగాణీ బేసిన్‌లో పడ్డ వాంతిని పరీక్షించాడు డాక్టర్ మెహతా. "మిస్టర్ సురేష్ ఇటు చూడండి. వాంతిలో విషం వచ్చేసింది. ఇదుగో నల్లగా కుంకుడు గింజలా ఉంది" అంటూ పాన్‌లో ఉన్న ఉండని చూపించాడు. సురేష్‌తో పాటు హేమ, కామాక్షమ్మగారు కూడా ముందుకి వంగి ఆ ఉండని చూశారు. నల్లని కుంకుడు గింజంత ఉండ కనిపించింది.

చాలా రోజుల తర్వాత సురేష్ ముఖం కల కలలాడింది.

"సో మిస్టర్ సురేష్ ఇంక మీరు దిగులు పడనక్కరలేదు. ఈ రోజు ట్రీట్‌మెంట్ మొదలు పెట్టున్నాను. యూ విల్ బి పెర్‌ఫెక్ట్‌లీ ఆల్ రైట్. పది రోజుల్లో హైద్రాబాద్ వెళ్ళిపోవచ్చు అన్నాడు మెహతా.

ఆరోజు డాక్టర్ మెహతా దగ్గర సెలవు తీసుకోడానికి వచ్చారు సురేష్, హేమ, కామాక్షమ్మలు.

"మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. బ్రతుకుతాననే ఆశ వదిలిన సమయంలో దేవుడిలా వచ్చి నాకు కొత్త జీవితం ఇచ్చారు" అన్నారు సురేష్ ఆనంద భాష్పాలు తుడుచుకుంటూ.

"నాదేం లేదు. మీ బాబాయి నిన్ను నా దగ్గరికి పంపించినందుకు ఆయనకి థాంక్స్ చెప్పాలి. ఆలస్య చేయకుండా మీరు వచ్చారు. అందుకే తగ్గింది."

"కాని డాక్టరుగారూ అమితమైన అభిమానాన్ని నటించి ఆ విధవావిడ నా ప్రాణం తీయాలనుకుందంటే చాలా బాధగా ఉంది" అన్నాడు సురేష్ బాధతో.

"మిస్టర్ సురేష్ యూ ఆర్ మిస్టేకెన్. ఆవిడ నీకే విష ప్రయోగం చేయలేదు. ఆవిడ నిజంగానే అమాయకురాలు."

"అదేమిటి డాక్టర్ మీరేగా విషప్రయోగం జరిగిందన్నారు. నా వాంతిలో విషపు ఉండని కూడా చూపించారు."

"అది సైకియాట్రిక్ ట్రీట్‌మెంట్‌లో భాగం. నీ మనసులో విషప్రయోగం జరిగిందన్న భావం బలంగా పాతుకుంది. దాన్ని తొలగించడం బ్రహ్మతరం కాదు. అందువల్ల మీ అనుమానం నిజమేనని మేం ఒప్పుకోవాలి. తరువాత ఆ విషాన్ని కక్కించి నమ్మకం కలిగించాలి. విషం వాంతయిందన్న నమ్మకం కుదిరాక ఆరోగ్యం అదంతట అదే చక్కబడుతుంది. నేను చేసింది అదే."

"ఎంత విచిత్రం! మరి ఆ ఉండ!"

"ఉండలేదు. దండాలేదు. అది మామూలు కుంకుడు గింజ. నువ్వు కళ్ళు మూసుకుని వాంతి చేసుకుంటున్నప్పుడు జాగ్రత్తగా ఆ గింజను నేనే బేసిన్‌లో వేశాను. అదే నీకు విషం ఉండని చూపించాను.'

"అందుకే అంటారు. అనుమానం పెనుభూతం అని. అది సరే, మరి నాకు పొట్టనొప్పి నిజంగానే రావడం అది ఏ మందుకీ, వైద్యానికీ తగ్గకపోవడం వాస్తవమేగా. మరి దాని సంగతి ఏమిటి?"

" నీ మెడికల్ రిపోర్ట్స్‌లో ఏమీ లోటు లేదు. బేరియం రిపోర్టులో మాత్రం స్లయిట్ అల్సర్ ఫారం అవుతున్న ఇండికేషన్ ఉంది. ఇది అమీబియాసిస్ వల్ల రావచ్చు. లేదా వేరే కారణాలు ఉండ వచ్చు. అయితే కోలిక్ పెయిన్ అని ఒకటి ఉంది. దానివల్ల విపరీతంగా పొట్ట నొప్పి వస్తుంది. ఇది ఎందుకు వచ్చిందో సరిగ్గా తెలియక పొరపాటు పడ్తూండడం సాధారణంగా జరుగుతుంటుంది. జాగ్రత్తగా ట్రీట్ చేస్తే ఇదీ తగ్గిపోతుంది. కాని మీరు తడవ తడవకీ మందులు, వైద్యాలు మార్చడంతో ఏ మందూ ఏమీ చేయలేదు. ఇప్పుడు ఈ పది రోజులూ నేను ఇచ్చిన మందులు ఆ అల్సర్‌ని, ఈ కోలిక్‌నూ కూడా తగ్గించాయి" అని వివరించాడు డాక్టర్ మెహతా. "ఎంత పొరపాటైంది. పాపం ఆ ఉత్తమ ఇల్లాల్ని అనుమానించాం ఇంకానయం వెళ్ళి అడగలేదు' అంటూ నొచ్చుకుంది హేమ.

"ఇదంతా నా మూలంగానే. లేనిపోని అనుమానాలని నేనే రేకెత్తించాను. పాతకాలం దాన్ని. విన్నవేవో వాగాను" అంటూ బాధపడింది కామాక్షమ్మగారు.

"ఇటువంటి మూఢ విశ్వాసాలు ఒకప్పుడు ఉండేవేమో కాని, ఇప్పుడు బళ్ళారిలో కాదు కదా ఎక్కడా ఉన్నాయనుకోను అయినా చదువుకున్న వాడినయ్యుండీ నేనూ అర్థం లేకుండా అనుమానించానే."

"ఓకే పాస్ట్ ఈజ్ పాస్ట్. ఆల్ ఈజ్ వెల్ దట్ ఎన్‌డెడ్ వెల్" అన్నాడు డాక్టర్ మెహతా.

బొంబాయికి పీనుగలా వచ్చిన సురేష్ ఏనుగులా అయి హైదరాబాదుకి తిరుగు ప్రయాణం కట్టాడు.

*(రచన, నవంబర్ 1995, దీపావళి సంచిక)*